సాక్షి నిర్మల్

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



పోలీసులు దిద్దిన కాపురం

చిన్నచిన్న కారణాలతో గొడవపడి భార్యాభర్తలు ఠాణా మెట్లెక్కుతున్నారు. ఇలాంటి వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాలు నిలబెడుతున్నారు. 10లో▸



అదుపు తప్పితే అంతే.. 11లో▸

జిల్లాలో పలుచోట్ల రోడ్ల పక్కనే వ్యవసాయ బావులున్నాయి. రెయిలింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదవశాత్తు వాటిలో పడిపోతున్నారు.

గరిష్టం/కనిష్టం
27.0 /24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్ వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కర్ణ కుమార్

నిర్మల్‌టౌన్: ఈనెల 9న జిల్లా ప్రధాన న్యాయస్థానంలో నిర్వహిస్తున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన న్యాయస్థానంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణ కుమార్ మాట్లాడుతూ.. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శనివారం లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు నిర్మల్, ఖానాపూర్, భైంసా కోర్టుల్లో రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇందులో భాగంగా ఫీల్డ్ లోక్ అదాలత్ నిర్వహించి 1,343 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. ఇందులో క్రిమినల్, సివిల్, భూతగాదాలు, రోడ్డు ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదాలు, డ్రంకెన్ డ్రైవ్ కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఇందులో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ ఉన్నారు.

సంపద వనం పరిశీలన



మొక్కలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కడెం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంపద వనాలను శుక్రవారం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ పరిశీలించారు. సంపద వనాలతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. వనాల్లో నాటిన మొక్కలు ఎదిగేలా సంరక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో ఉపేందర్, ఏపీవో జయదేవ్, సర్పంచ్ అనూష, లక్ష్మణ్ తదితరులున్నారు.

సోన్: మండలం సాకేర గ్రామంలోని సంపద వనాలను కలెక్టర్ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. గ్రామంలో నీటి పారుదల శాఖకు సంబంధించిన హెక్టార్ భూమిలో సీతాఫలం, జామ, నిమ్మ, మామిడి, కొబ్బరి, టేకు మొక్కలు నాటాలని సూచించారు. అవసరమైన వసతులు కల్పిస్తామని చెప్పారు. నీటి వసతి సరిగా లేదని తెలిసి వెంటనే బోరు మోటరు మంజూరు చేశారు. ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఏపీడీ ఓసా ప్రసాద్, ప్లాంటేషన్ మేనేజర్ రఫీ, కార్యదర్శి ప్రియాంకారెడ్డి, ఈజీఎస్ సిబ్బంది, నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ధరణిలో తప్పులు.. రైతన్నకు తిప్పలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట లచ్చన్న

కడెం: ధరణిలో జరిగిన తప్పుల కారణంగా ఓ రైతన్నకు తిప్పలు తప్పడంలేదు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన రెంటం లచ్చన్నకు చెందిన రెండెకరాల భూమి ధరణిలో లావణి పట్టాగా నమోదైంది. గతేడాది తప్పు సవరించాలని రెవెన్యూ అధికారులను పలుసార్లు సంప్రదించినా వారు పట్టించుకోలేదు. దీంతో లచ్చన్న శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆవేదన వ్యక్తం చేశాడు. లావణి పట్టాతో బ్యాంకు రుణాలు అందడం లేదని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు.

దరఖాస్తుల స్వీకరణ



ఆవరణను పరిశీలిస్తున్న పరశురాం

కుంటాల: ప్రభుత్వం మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేసిందని, ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఐఈవో పరశురాం తెలిపారు. శుక్రవారం కుంటాల ఉన్నత పాఠశాలలో కళాశాలకు అవసరమయ్యే మౌలిక వసతులు పరిశీలించి మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో బైపీసీ గ్రూపు మాత్రమే ప్రారంభిస్తామని, వివరాలకు 85558 38196 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ తుకారాం, వెంకటేశ్ ఉన్నారు.

నిలకడగా 'కడెం' నీటిమట్టం

కడెం: కడెం ప్రాజెక్ట్ నీటిమట్టాన్ని అధికారులు 696 అడుగులుగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం 8,096 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ఒక వరద గేటు ఎత్తి 4,397 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి నీటిమట్టం 700 (7.603టీఎంసీలు) అడుగులు కాగా, ప్రస్తుతం 696.625 (6.751టీఎంసీలు) అడుగులు ఉంది.

బీజేపీ మరోయాత్ర..!

- ఈ నెలలో బాసర నుంచి ప్రారంభం
- పార్టీ చీఫ్ కిషన్‌రెడ్డితో బస్సుయాత్ర
- సమాయత్తమవుతున్న పార్టీ శ్రేణులు
- గతంలో జిల్లానుంచే 'ప్రజాసంగ్రామం'
- ఉమ్మడిజిల్లా నియోజకవర్గాల మీదుగా..
- రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్న కమలదళం



నిర్మల్: ఐదోవిడత ప్రజాసంగ్రామయాత్రతో జిల్లాలో గ్రామగ్రామానికి పార్టీని తీసుకువెళ్లిన బీజేపీ ఇక ఎన్నికలే లక్ష్యంగా మరోయాత్రకు జిల్లా నుంచే శ్రీకారం చుడుతోంది. ఈనెల మూడు లేదా నాలుగోవారంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు చోట్ల నుంచి బస్సుయాత్ర చేపట్టేందుకు పార్టీ సిద్ధమైంది. ఇందులో ఒకటి నిర్మల్ జిల్లా బాసర నుంచి ప్రారంభించనున్నారు. జిల్లా నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్రను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నిర్వహిస్తుండటం విశేషం. ఉమ్మడి జిల్లాలోని మొత్తం 10 నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి నిజామాబాద్, మెదక్ జిల్లాల మీదుగా ఈ యాత్ర హైదరాబాద్‌కు చేరేలా ప్లాన్‌చేస్తున్నారు.

'ప్రజాసంగ్రామ'ం ప్రభావంతో..

గెలుపుపై నమ్మకం పెట్టుకున్న నియోజకవర్గాల్లో జిల్లాలో మూడు స్థానాలున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కడి నుంచి బస్సుయాత్ర ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో ప్రజాసంగ్రామయాత్ర తర్వాత పార్టీ గ్రామగ్రామానికీ చేరింది. ప్రతీగ్రామంలో పార్టీ కమిటీలు బూత్‌లెవల్ దాకా వెళ్లాయి. డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రామారావుపటేల్‌తోపాటు పలువురు సీనియర్ల చేరిక అప్పటి నుంచే జిల్లాలో మొదలైంది. ఆ ప్రభావాన్ని మరింత ప్రభావవంతంగా మార్చేందుకు పార్టీ ఈ యాత్ర చేపడుతోంది.

మరింత బలోపేతమే లక్ష్యంగా..

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండేలా బీజేపీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు బస్సుయాత్ర ఎంచుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాలోని ముథోల్, నిర్మల్, ఖానాపూర్ మూడు నియోజకవర్గాల్లో గెలుపొచ్చు అని సర్వే ఫలితాలున్నాయని పేర్కొంటున్నాయి. ఈనేపథ్యంలోనే జిల్లాలో బస్సుయాత్ర ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను మార్చిన తర్వాత కొంత డీలా పడిన క్యాడర్‌లోనూ జోష్ నింపేందుకూ బస్సుయాత్ర ఉపయోగపడుతుందని అంటున్నారు. జిల్లాపై ప్రత్యేక దృష్టిపెట్టిన పార్టీ ఇటీవల నిర్మల్‌లో మాస్టర్‌ప్లాన్‌పై మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన దీక్షకూ ప్రాధాన్యతనిచ్చింది. పార్టీ రాష్ట్ర ప్రధాన నాయకులైన ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, వివేక్ వెంకటస్వామితో పాటు ఏకంగా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కూడా నిర్మల్‌కు వచ్చారు. ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోనూ బలమైన ఆశావహులు పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. ఈనేపథ్యంలో కమలదళం జిల్లాపై భారీగా ఆశలు పెట్టుకుంది.

అన్ని నియోజకవర్గాల్లో..

బాసర నుంచి ప్రారంభించే బస్సుయాత్ర ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోని దాదాపు అన్ని నియోజకవర్గాలు కవర్ అయ్యేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. పార్టీవర్గాల అంచనా మేరకు ఈనెల 26వ తేదీన యాత్ర ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ముందుగా బాసర సరస్వతీ అమ్మవారికి పూజలు చేసి, అక్కడి నుంచి భైంసా బయలుదేరుతారు. అక్కడ బహిరంగ సభ ఉంటుంది. అనంతరం నర్సాపూర్(జీ), దిలావర్‌పూర్ మీదుగా నిర్మల్‌కు వస్తారు. ఇక్కడ బహిరంగసభ అనంతరం ఆదిలాబాద్ జిల్లా బోథ్, ఆదిలాబాద్, ఉట్నూర్ మీదుగా కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల మీదుగా నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ మీదుగా హైదరాబాద్ వరకు వెళ్లనున్నట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి. ప్రతీ నియోజకవర్గకేంద్రంలో బహిరంగసభ నిర్వహించనున్నారు. యాత్ర ముగింపుసభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మంత్రి అల్లోల



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అల్లోల

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

కేటీఆర్‌ను కలిసిన జాన్సన్‌నాయక్



మంత్రికి మొక్క ఇస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్ శుక్రవారం మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని అతడి నివాసంలో కలిశారు. ఇటీవల అమెరికా పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై మంత్రితో చర్చించారు.

మహాగాం పీహెచ్‌సీ తనిఖీ

భైంసా రూరల్: మండలంలోని మహాగాం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ఆయుష్మాన్ భారత్, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సేవల గురించి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట వైద్యుడు శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

కుష్ఠు లెక్క తేలింది



జిల్లా కేంద్రంలో సర్వే పరిశీలిస్తున్న మానిటరింగ్ అధికారి సుధ (ఫైల్)

- ఈ నెల 7న ముగిసిన ఇంటింటి సర్వే
- జిల్లాలో 12 పాజిటివ్ కేసుల గుర్తింపు
- వందశాతం అరికట్టేందుకు చర్యలు
- బాధితులకు ఉచితంగా మందులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో 12 కుష్ఠు కేసులు నమోదయ్యాయి. పక్షం రోజులుగా జిల్లాలో చేపట్టిన సర్వేలో బాధితుల లెక్క తేలింది. గత నెల 16న ప్రారంభించిన సర్వే ఈ నెల 7న ముగిసింది. వైద్యారోగ్య శాఖ జిల్లా వ్యాప్తంగా 557 బృందాలతో సర్వే చేయించింది. జిల్లా వ్యాప్తంగా రెండో ఏఎన్‌ఎంలు, ఇతర ఉద్యోగులు క్రమబద్ధీకరణకు సమ్మెకు దిగడంతో సర్వే గురువారం ముగిసింది. ఇంటింటికీ తిరిగిన సర్వే బృందాలు ప్రజలను కలిసి వ్యాధి లక్షణాల గురించి అవగాహన కల్పించారు. అనుమానిత కేసుల వివరాలు సేకరించారు.

వ్యాధిగ్రస్తులకు ఆర్నెళ్ల కోర్సు..

ప్రతీరోజు ఉదయం 8గంటల నుంచే వైద్య బృందాలు సర్వే ప్రారంభించాయి. రోజుకు 10వేలకుపైగా ఇళ్లను సందర్శించిన సర్వే బృందాల సభ్యులు లెప్రసీ కేసులు గుర్తించారు. ఇప్పటివరకు 2,228 మంది లెప్రసీ అనుమానితులను గుర్తించి ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల అధికారులకు వివరాలు పంపించారు. అందులో అనుమానిత కేసులను స్క్రీనింగ్ చేయగా 12 కేసులు బయటపడ్డాయి. వారిలో ఐదు మచ్చలున్న వారికి ఆరునెలల కోర్సు అందించేందుకు నిర్ణయించారు. మిగతా అనుమానితులను డాక్టర్ వద్దకు పంపించారు. వీరికి మరో 20 రోజుల్లో స్క్రీనింగ్ చేసి లెప్రసీ ఉందా.. లేదా అన్నది నిర్ధారిస్తారు. అవసరమైన మందులు ఉచితంగా అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఉచితంగా మందులు

లెప్రసీ నిర్ధారణ అయినవారికి అవసరమైన మందులను ఉచితంగా అందించనున్నారు. క్రమంతప్పకుండా పర్యవేక్షిస్తూ భరోసా కల్పించనున్నారు. ప్రతీ సంవత్సరం లెప్రసీ సర్వే కొనసాగించడం ద్వారా ముందుగానే అనుమానితులను గుర్తించి వ్యాధిని ఆదిలోనే కట్టడి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెటుకుని ముందుకు సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,77,122 ఇళ్లను సర్వే చేశారు. 6,95,745 మందిని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మందులు సక్రమంగా వాడిన వారు ఏడాదిలోగా వ్యాధి నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ప్రజలకు అవగాహన

కుష్ఠుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వ్యాధి ప్రాథమికంగా నాడీ వ్యవస్థ, కళ్లు, కీళ్లు, శ్లేష్మ పొరలు, కండరాలు, వృషణాలు, శరీర కణజాలాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రోగ నిరోధక శక్తి క్రమంగా తగ్గుతుంది. వ్యాధి ఇతర అంటు వ్యాధుల్లాగా సూక్ష్మక్రిమి, మైక్రో బ్యాక్టీరియల్ ద్వారా సంక్రమించే అంటువ్యాధి కావడంతో ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వ్యాధిగ్రస్తుడి నుంచి గాలి ద్వారా ఇతరులకు వ్యాధి వ్యాపిస్తుందని వివరిస్తున్నారు. చర్మం తిమ్మిరి, పక్షవాతం, నరాలు పెద్దవిగా మారడం, అంధత్వానికి గురయ్యే అవకాశాలున్నాయని వివరిస్తున్నారు.

నివారణకు కృషి చేస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా లెప్రసీ సర్వే గత నెల 16న ప్రారంభించాం. వెయ్యి మందికి పైగా అనుమానితులను గుర్తించాం. వారికి పరీక్షలు నిర్వంచగా 12 మందికి పాజిటివ్‌గా తేలింది. వ్యాధిగ్రస్తులకు అవసరమయ్యే మందులు అందజేశాం. అన్ని పీహెచ్‌సీల్లో కుష్ఠు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. ప్రజల ఆరోగ్య విషయాలపై ఎప్పటికప్పుడు తెలుసుకొని నివారణ అంశాలపై తెలియజేస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి

ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

భైంసాటౌన్: పట్టణంలో గణేశ్ నవరాత్రోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. భైంసాలో శుక్రవారం పట్టణ సీఐ శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్, మిషన్ భగీరథ సిబ్బందితో కలిసి పంజేషచౌక్, గణేశ్‌నగర్, భట్టిగల్లి తదితర ప్రాంతాల్లో వినాయక నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శోభాయాత్ర మార్గంలో విగ్రహాల తరలింపు సమయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఐకి సూచించారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లు, వంగిన, శిథిల స్తంభాలను మార్చాలని ఉన్నతాధికారులను కోరినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పికెటింగ్ పరిశీలించాలని సూచించారు. రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని మిషన్ భగీరథ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట రూరల్ సీఐ నైలు నాయక్, ఎస్సై శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్ ఫైజుల్లాఖాన్, అబ్దుల్ మాజిద్, కో ఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతనకుమార్ ఆరోపించారు. పెరుగుతున్న ధరలను నియంత్రించాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని, ఉపాధి, అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గం నూతన్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎందుకు విస్మరించిందని ప్రశ్నించారు. ప్రతీ ఒక్కరి బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు గడిచినా నేటికీ అమలు పరచలేదన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్ పరం చేసిందని విమర్శించారు. ఇప్పటికే ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెట్టి కొత్త ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉపాధిహామీ పథకం బడ్జెట్‌లో కోత విధించి నిధుల్ని తగ్గించిందన్నారు. వేతనాలు సరైన సమయంలో ఇవ్వకుండా మోసం చేస్తూ రోజురోజుకూ ఉపాధి పనిని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తోందని పేర్కొన్నారు. కుల, మత, తెగల మధ్య ఘర్షణలు సృష్టించి మణిపూర్ సంఘటనలు సష్టిస్తోందని పేర్కొన్నారు. సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతనకుమార్, బొమ్మెన సురేశ్, జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పోశెట్టి పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక శ్రావణలక్ష్మి వ్రతపూజ



భైంసా: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయ ఆవరణలో సామూహిక శ్రావణలక్ష్మి వ్రతపూజను ఘనంగా నిర్వహించారు. అలాగే విశేష సంకల్పం, గణపతి పూజ, కలశ స్థాపన, రక్షా బంధనం తదితర వైదిక క్రతువు నిర్వహించారు. సుమారు వందకుపైగా సుహాసినులు, ఆలయ స్థానాచార్యులు, వేదపండితులు, పూజారుల వైదిక బృందం ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శరత్, ఈవో, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


బాసరలో ఆకస్మిక తనిఖీ

భైంసా: బాసరలో శుక్రవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాల తనిఖీ చేశారు. పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని సర్పంచ్ లక్ష్మణరావు, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి కోరారు.

సోయా పంట పరిశీలన

తానూరు: మండల కేంద్రంలో రైతులు సాగు చేసిన సోయా, పత్తి పంటలను శుక్రవారం డీఏవో అంజి ప్రసాద్ పరిశీలించారు. సోయాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. తెల్ల దోమ ఉధృతి, నివారణ చర్యల గురించి వివరించారు. ఆయన వెంట ఏవో గణేశ్, రైతులున్నారు.

కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి



జామ్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి

సారంగపూర్: ప్రతీ ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలాల్లో తప్పకుండా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని జామ్, సారంగపూర్ గ్రామాల్లో ప్రజలకు కూరగాయల మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సేంద్రియ విధానంలో కూరగాయలు సాగు చేసుకుని ఆహారంగా తీసుకుంటే పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, జామ్ ఎంపీటీసీ సభ్యురాలు మహిపాల్ వనజ, ఉపసర్పంచ్ విలాస్, ఏపీఎం మాధురి, నాయకుడు నారాయణ, ఐకేపీ మహిళలు, సిబ్బంది ఉన్నారు.

మామడ: మండల కేంద్రంలో డీఆర్డీవో విజయలక్ష్మి సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వయం ఉపాధి పొందుతున్న వారికి రుణాలు అందించాలని సూచించారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం అరుణ, ఏపీడీ గోవింద్‌రావ్, ఈజీఎస్ ఏపీవో శివాజీ, డీపీఎంలు సాయిప్రసాద్, జ్ఞానేశ్వర్ ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

నిర్మల్‌చైన్‌గేట్: ఏడురోజులుగా సమ్మె చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ముందుగా జిల్లా కేంద్రంలోని దీక్ష శిబిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమణ, రాములు, భరత్, శ్రీనివాస్ తదితరులున్నారు. అలాగే దీక్ష శిబిరాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాకూరు తిరుపతి, కార్యదర్శి డీ పోశెట్టి తదితరులు సందర్శించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

నిరుద్యోగులకు తీపి కబురు

- డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- జిల్లాలో 115 పోస్టుల భర్తీ
- నవంబర్‌లో ఆన్‌లైన్ పరీక్ష

నిర్మల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు తీపి కబురు అందించింది. గురువారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. డీఎడ్, బీఎడ్ పూర్తి చేయడంతో పాటు ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారు ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నారు. వారందరిలో ఆశలు చిగురించాయి. జిల్లావ్యాప్తంగా ఈసారి 115 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు. పోస్టులు తక్కువ సంఖ్యలో కేటాయించడంతో సదరు అభ్యర్థుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది. ఈనెల 20 నుంచి అక్టోబర్ 21వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి నవంబర్‌లో పరీక్ష నిర్వహిస్తామని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది. http://schooledu.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. 18–44 ఏళ్లలోపు వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఇచ్చారు. ఈసారి పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. నవంబర్ 20 నుంచి 30వ తేదీ లోపు ఆన్‌లైన్ విధానం ద్వారా అభ్యర్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఇందుకు కోసం రాష్ట్రవ్యాప్తంగా 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఆరేళ్ల నిరీక్షణకు తెర..

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన 2017లో టీఆర్టీ నిర్వహించారు. ఆ తర్వాత నియామకాలు చేపట్టకపోవడంతో అభ్యర్థుల్లో నిరుత్సాహం పెరిగిపోయింది. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించడంతో వారిలో ఆశలు చిగురించాయి. ఇప్పటికే ప్రభుత్వం ఈనెల 15న టెట్ పరీక్ష కూడా నిర్వహించనుంది. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 115 పోస్టులు

డీఎస్సీ 2023 నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో 115 ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. ఇందులో 91 ఎస్జీటీ పోస్టులున్నాయి. 16 స్కూల్ అసిస్టెంట్, నాలుగు భాష పండితులు, నాలుగు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే జిల్లాలో 542 పోస్టులు ఖాళీ ఉండగా 115 మాత్రమే భర్తీ చేయనుండడంతో అభ్యర్థుల్లో నిరాశ నెలకొంది.

క్లుప్తంగా

14మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 14మందికి జరిమానా, ముగ్గురికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పించినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. 14మందికి రూ.11900 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని ట్రాఫిక్ ఎస్సైలు పేర్కొన్నారు.

నాటుసారా స్వాధీనం



నాటుసారా పట్టుకున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి, కొత్తగూడ, లక్కారం గ్రామాల్లో నాటుసారా తయారీతో పాటు విక్రయిస్తున్న స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ మహేందర్ సింగ్ తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాజేశ్‌తో కలసి ఆయా ప్రాంతాల్లో నాటుసారా తయారు చేయడంతో పాటు విక్రయిస్తున్న ప్రాంతాల్లో దాడులు చేసి మూడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడకు చెందిన ప్రమీల, తాటిగూడకు చెందిన తుమ్ర చిన్నుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కొండ చిలువ హతం

సిరికొండ: మండలంలోని సూర్యపేట్ గ్రామంలో గురువారం రాత్రి ఆత్రం సావిత్రిబాయి ఇంట్లో శబ్దం కావడంతో సావిత్రిబాయి నిద్రలేచి చూడగా కొండచిలువ కనిపించింది. ఒక్కసారిగా భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా కొండ చిలువ ఇంట్లోని కోడిని తింటు కనిపించింది. దీంతో గ్రామస్తులు భయంతో కర్రలతో దాడి చేసి కొండచిలువను హతమార్చారు.

గాయపడిన వ్యక్తి మృతి



స్వామి మృతదేహం

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన మేకల స్వామి(44) నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. స్వామి ఈనెల 1వ తేదీన బీరవెల్లి నుంచి ప్యారమూర్ గ్రామ సమీపంలోని తన పంటపొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఆయనను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి స్వామి మృతి చెందాడు. భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులు దిద్దిన కాపురం..

''ఇచ్చోడ మండలానికి చెందిన యువకుడు ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. మొదటి, రెండవ కాన్పులో ఇద్దరు ఆడ పిల్లలు పుట్టారు. మూడవ కాన్పులోనూ ఆడ పిల్లే జన్మించింది. మగ పిల్లలు పుట్టడంలేదని భార్యను వేధించడం మొదలుపెట్టాడు. చీటికిమాటికి భార్యతో గొడవ, భర్త టార్చర్‌తో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రుల ప్రమేయంతో పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసుల కౌన్సెలింగ్ ద్వారా ప్రస్తుతం వారి కాపురం సజావుగా సాగుతోంది.''

''గుడిహత్నూర్ మండలానికి చెందిన వ్యక్తికి కొన్నేళ్ల క్రితం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన యువతితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తపై భార్యకు, భార్యపై భర్త అనుమానాలు ఎక్కువయ్యాయి. దీంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. ఇరువురి మధ్యలో మనస్పర్థలు ఏర్పడి తరుచూ గొడవలతో పోలీస్‌స్టేషన్ మెట్లెక్కారు.''

- భార్యాభర్తల మధ్య చీటికిమాటికి చిర్రుబుర్రులాటలు
- చిన్న సమస్యకే ఠాణా మెట్లెక్కుతున్న వైనం
- కౌన్సెలింగ్ ద్వారా ఒకటిచేస్తున్న పోలీసులు



ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ చేస్తున్న ఉట్నూర్ డీఎస్పీ(ఫైల్)

ఇచ్చోడ: ఇలా చిన్నచిన్న మాటలకే అనుమానపడటం, ఒకరిపై ఒకరు చిర్రుబుర్రులాడుకోవడం, తరుచూ గొడవపటడం వంటి సంఘటనలు అన్యోన్యంగా ఉండాల్సిన కాపురంలో భార్యాభర్తల మధ్య దూరాన్ని పెంచుతోంది. నువ్వేంతంటే నువ్వేంత అనే పంతాలకు పోయి గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకు తెచ్చుకొని పచ్చని సంసారాల్లో నిప్పులు పోసుకుంటున్నారు. కుటుంబం అంటే చిన్నచిన్న సమస్యలు సర్వసాధారణం.. వాటిని సమన్వయంతో పరిష్కరించుకుంటూ వెళితే వాటికవే పరిష్కరమవుతాయి. ఇటువంటి సమయంలో ఇరువర్గాల తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు సంయమనం పాటించాలి. వారు కూడా అగ్నికి ఆజ్యం పోసినట్లు వ్యవహరిస్తే సమస్య మరింతగా సంక్లిష్టంగా మారుతుంది. దీంతో చివరికి ఠాణా మెట్లు ఎక్కి కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

రాజీకే ప్రాధాన్యత..

జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌తో పాటు మిగితా పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న భార్యాభర్తల కేసులు రాజీకే ప్రాధాన్యత ఇస్తున్నారు. పోలీసులు వీలైనంత వరకూ కౌన్సెలింగ్‌తో కలిసిపోయేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇద్దరి మధ్య పట్టు వీడకపోతే కేసులు నమోదు చేస్తున్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో ఠాణాల్లో ఫిర్యాదులు, కేసులు

ఏడాది	ఫిర్యాదులు	ఎఫ్ఐఆర్	పరిష్కారం
2022	572	96	476
2023	428	45	383



గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలి..



రోజురోజుకూ మానవ సంబంధాలు దూరమవుతున్నాయి. భార్యాభర్తలు, తల్లిదండ్రులు అనే గౌరవం లేకుండా పోతోంది. భార్యాభర్తల మధ్య సమన్వయం తగ్గిపోతుంది. ఒకరిపై ఒకరికి గౌరవం లేదు. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సమాజంపై అవగాహన లేకపోవడం కూడా ఓ కా రణం. భార్యాభర్తలు గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకొనే విధంగా మెలగాలి.

– ఓంప్రకాశ్, సైక్రియాటిస్టు, రిమ్స్, ఆదిలాబాద్

కాపురం నిలబెట్టేలా కౌన్సెలింగ్

భార్యాభర్తలు గొడవ పడి ఆవేశం, కోపంలో గొడవపడి పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. అలాంటి వారికి పలు దఫాలుగా కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాన్ని నిలబెట్టడానికి కృషి చేస్తున్నాం. ఎక్కువ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరమవుతున్నాయి. కౌన్సెలింగ్ ద్వారా కూడా మార్పురాని కొన్ని మొండి కేసులను ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నాం.

– శ్రీనివాస్, మహిళా పోలీస్‌స్టేషన్, సీఐ, ఆదిలాబాద్

తపాల శాఖ ద్వారా విదేశాలకు పార్సిల్



మాట్లాడుతున్న సుజిత్ కుమార్

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ ప్రధాన తపాల కార్యాలయం నుంచి డాక్ నిర్యాత్ కేంద్ర సర్వీస్ ద్వారా తక్కువ ఖర్చుతో విదేశాలకు సులభంగా పార్సల్స్ పంపే సేవలు ప్రారంభించినట్లు ఆదిలాబాద్ సబ్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ సుజిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉట్నూర్ పరిధిలోని బ్రాంచి పోస్ట్ మాస్టర్లతో సమావేశం నిర్వహించారు. విదేశాలకు పార్సల్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. శుక్రవారం ప్రధాన తపాల కార్యాలయంలో సైతం విదేశాలకు పార్సెల్ సర్వీస్ కరపత్రాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సమీప పోస్టు ఆఫీసుల్లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం తిరుపతి, రమేశ్, బీపీఎంలు చంద్రశేఖర్, ప్రవీన్, గోకుల్, విజయ్, సాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాద్‌నగర్‌కు చెందిన మోసిన్‌ఖాన్ (35) అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మోసిన్‌ఖాన్ ఈ నెల 4న ఉదయం 9గంటలకు ఇంటి నుంచి వెళ్లారు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ ఫలితం కానరాలేదు. దీంతో అతడి భార్య సమ్రీన్ ఖానం ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా హనుమాన్ ఆలయ పునః ప్రతిష్ఠ



గణపతి పూజలో పాల్గొన్న భక్తులు

- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- 10న విగ్రహ ప్రతిష్ఠ, మహా అన్నదానం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లోని నాయుడువాడలో కొలువుదీరిన గుట్ట వీరన్న ఆంజనేయ ఆలయంలో శుక్రవారం నుంచి ఆలయ పునః ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ప్రారంభమైన వేడుకలు ఈ నెల 10 ఆదివారం వరకు కొనసాగనున్నాయి. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆలయాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూ.38 లక్షలు మంజూరు చేయించడంతో ఆలయ రూపురేఖలే మారిపోయాయి. శుక్రవారం ఉదయం యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గణపతి పుజ, అఖండ దీపారాధన, పుణ్యాహవచన, రక్షబంధన, అంకురార్పణ, పంచగవ్య ప్రాశన తదితర కార్యక్రమాలు చేపట్టారు. శనివారం గణపతి పూజ, శపన మండవ ఆరాధన విగ్రహ పంచామత అభిషేకము, స్థాపిత హోమాలు, మహా హారతి తీర్థ ప్రసాద వితరణ చేపట్టనున్నారు. ఆదివారం ఉదయం గం 7.30 గంటలకు వీరాంజనేయ స్వామి సమేతశివ పంచాయతన యంత్ర ప్రతిష్ఠా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తారు.



పునఃప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న హనుమాన్ విగ్రహం

ఉపాధ్యాయ సమస్యలు తీర్చాలని ధర్నా



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు



పీవోకు మెమోరండం అందిస్తున్న సంఘ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉపాధ్యాయులు, విద్యార్థుల, పాఠశాలల సమస్యలను తీర్చాలని కోరుతూ తెలంగాణ ప్రోగ్రేసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు మాట్లాడుతూ.. జీవో నంబర్ 3 అమలుపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని తెలిపారు. బదిలీలు, పదోన్నతులపై షెడ్యూల్ విడుదల చేయాలని, ఉపాధ్యాయులకు కేటాయించిన హాస్టల్ అదనపు విధుల నుంచి మినహాయింపు ఇచ్చి వారిని బోధనకు పరిమితం చేయాలన్నారు. అదే విధంగా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులందరికీ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల పేస్కేల్‌ను వర్తింపచేయాలని, గిరిజన విద్యాభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ప్రతీ మూడు మాసాలకు ఓసారి ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశాలను నిర్వహించాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే స్టడిమెటీరియల్‌ను అందించాలని, గిరిజన విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు రిజర్వ్ ఫండ్ మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన సంక్షేమ హాస్టళ్లను ఆశ్రమ పాఠశాలలుగా మార్చాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు మెమోరండం సమర్పించారు. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారికి మద్దతు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ, కుమ్రం భీం జిల్లా కార్యదర్శి కనక వెంకటేశ్వర్‌రావు, మర్సుకోల జ్ఞానేశ్వర్, కల్పన, గంగాసాగర్, జ్యోతిరాం, జ్ఞానేశ్వర్, వినోద్, కృష్ణప్రసాద్, సుందర్ పాల్గొన్నారు.

భైంసా బీఆర్‌ఎస్‌లో ఫ్లెక్సీ కలకలం..!

భైంసాటౌన్: భైంసా పట్టణంలోని గాంధీగంజ్ ఎదురుగా కాటన్ మార్కెట్ యార్డు ప్రవేశ ద్వారం వద్ద మాజీ చైర్మన్ పి.కృష్ణ పేరిట వెలిసిన ఫ్లెక్సీ స్థానికంగా బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కొద్దికాలంగా ప్రస్తుత ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు వర్గం సిట్టింగ్ ఎమ్మెల్యేపై అసమ్మతి స్వరం ఎత్తుకున్న విషయం తెలిసిందే. మంత్రి తలసాని తనపై దాడి చేసిన వీడియోను స్థానిక బీఆర్ఎస్ శ్రేణులే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసి తనను అవమానించారని ఇదివరకు విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తననే ఉద్దేశించేలా కాటన్ మార్కెట్ ప్రవేశద్వారం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు దీనిపై రాజేశ్‌బాబు కౌంటర్ ఇవ్వనున్నట్లు సమాచారం.



కాటన్‌యార్డు వద్ద వెలిసిన ఫ్లెక్సీ

ఉబికి వస్తున్న పాతాల గంగ



చేతిపంపు ద్వారా ఉబికివస్తున్న నీరు

తానూరు: మండలంలోని భోసి గ్రామంలోని చేతిపంపు నుంచి పాతాళ గంగ ఉబికివస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో చేతిపంపు ద్వారా నీరు బయలకు వస్తోంది. శుక్రవారం గ్రామంలోని ప్రజలు చేతిపంపువద్దకు నీటి కోసం వచ్చే సరికి నీరు వృథాగా పోంతోంది. దీనిని చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు. విషయాన్ని గమనించిన స్థానికులు సంబంధిత అధికారిని వివరణ కోరగా భూగర్భజ లాలు పెరగడంతో నీరు వస్తోందని తెలిపా రు.

వడ్డెరులను షెడ్యూల్డ్ తెగల్లో చేర్చాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: అభివృద్ధికి ఆమడదూరంలోని వడ్డెర్లను షెడ్యూల్డ్ తెగల్లో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ద్యారంగుల నగేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో వడ్డెర కులస్తుల ప్రతినిధుల మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వడ్డెరుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. వడ్డెర్లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. క్వారీలలో పూర్తి హక్కు వడ్డెర్లకు, కాంట్రాక్ట్ పనులలో 20 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అందరికీ ప్రమాద బీమా కల్పించాలని తెలిపారు. ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న హైదరాబాద్‌లో వడ్డెరల ప్రతినిధుల మహాసభ నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశానికి అధిక సంఖ్యలో వడ్డెర నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకులు ఎల్లపు సమ్మయ్య, మండల అధ్యక్షుడు భుజంగ్‌రావు, నాగరాజు, సతీశ్, గోవింద్, తిమ్మయ్య, సంపంగి రమేశ్ ఉన్నారు.

స్విమ్మింగ్‌పూల్‌లో పడి ఒకరి మృతి



శశికాంత్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: స్విమ్మింగ్ పూల్‌లో పడి ఒకరు మృతిచెందిన సంఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ప్రియదర్శని కాలనీలో శ్రీరామరాజు అనే వ్యక్తి నూతనంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేకపోవడంతో వారి దగ్గర సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పట్టణంలోని పింజారిగుట్ట కాలనీకి చెందిన శశికాంత్ (35) తన మిత్రులతో కలిసి ఆ ఇంట్లో విందు చేసుకున్నాడు. ఈ క్రమంలో పైఅంతస్తులో నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. వెంటనే స్నేహితులు అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ముధోల్: మండల కేంద్రం ముధోల్‌లోని కంటి ఆస్పత్రి వద్ద శుక్రవారం ఉదయం తెల్లవారుజామున కారు బోల్తాపడింది. భైంసా నుంచి నిజామాబాద్ వైపు వృతిక్‌రెడ్డి అనే వ్యక్తి కారులో వెళ్తుండగా కంటి ఆస్పత్రి వద్దకు రాగానే అతి వేగంగా వెళ్లి రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో కారు బోల్తాపడింది. వృతిక్‌రెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడు.



అంత్యక్రియల కోసం శవంతో వాగు దాటుతున్న గ్రామస్తులు

ఖబ్రస్థాన్‌కు దారేది

జైనథ్: గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల కోసం మండలంలోని గూడ గ్రామ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామానికి చెందిన షేక్ అజీజ్ మరణించగా అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. ఖబ్రస్థాన్‌కు వెళ్లే దారిలో వాగు ఉండడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఇలా దాటి వెళ్లారు. ఏళ్లు గడిచినా గ్రామంలో కనీస సౌకర్యాలు కానరావడం లేదని, అంత్యక్రియలకు సైతం అవస్థలు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మించి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు బహుమతుల ప్రదానం



లక్ష్మికి చెక్కు అందజేస్తున్న సజ్జనార్



చెక్కు అందుకుంటున్న కే.ప్రాంజల్



బహుమతి అందుకుంటున్న రాజశ్రీ

రాఖీ పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు నిర్వహించిన లక్కీడ్రా విజేతలకు హైదరాబాద్‌లో శుక్రవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ బహుమతి ప్రదానం చేశారు. మొదటి బహుమతి భైంసాకు చెందిన ఎస్.లక్ష్మికి రూ.25వేలు, ద్వితీయ బహుమతి ఆదిలాబాద్‌కు చెందిన విద్యార్థిని కే.ప్రాంజల్‌కు రూ.15వేలు, తృతీయ బహుమతి డి.రాజశ్రీకి రూ.10వేలు విలువైన చెక్కులను అందజేశారు.